క్లుప్తంగా

ఆధార్ కేంద్రం ప్రారంభం



నల్లబెల్లి : రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని తహసీల్దార్ కృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల ప్రజలు ఆధార్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్ ఖన్నా, సీనియర్ అసిస్టెంట్ సలీమ్, ఆధార్ సెంటర్ నిర్వాహకుడు అడ్డగట్ల రాజు, దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య, ఎంఆర్‌పీఎస్ నాయకుడు పరికి రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



ఖానాపురం : మండలంలోని ఐనపెల్లి ఎంజేపీ గురుకుల విద్యాలయలో బుధవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు డాక్టర్ జ్యోతి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

వీగిన అవిశ్వాస తీర్మానం

పర్వతగిరి : మండలంలోని చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. డైరెక్టర్ల ఫిర్యాదుతో అధికారులు బుధవారం అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేశారు. మొత్తం 14 మంది డైరెక్టర్లకు గాను ఏడుగురు మాత్రమే హాజరు కావడంతో పూర్తి స్థాయిలో హాజరు కాలేదంటూ అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు డీసీఓ నీరజ ప్రకటించారు. ఇక చైర్మన్, వైస్‌చైర్మన్‌పై వచ్చిన ఆరోపణల మీద విచారణకు కమిటీ వేశామని ఆమె చెప్పారు. త్వరలో విచారణ జరిపిస్తామని, ప్రస్తుత నివేదికను జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

బీజేపీలో పలువురి చేరిక

ఖానాపురం : మండల కేంద్రంలో వివిధ పార్టీల కార్యకర్తలు బీజేపీలో బుధవారం చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి నాయకుడు కంభంపాటి ప్రతాప్ కండువా కప్పి ఆహ్వానించారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాజాప్రతాప్‌రెడ్డి, నర్సింహరాములు, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు'

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజిపేట పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి సాయి స్పష్టం చేశారు. పంచాయతీ నుంచి అనుమతి తీసుకోకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన పలువురికి బుధవారం ఆయన నోటీసులు అందజేసి మాట్లాడారు. గ్రామంలో ఏజెన్సీ పరిధిలోనిదని, పీసా చట్టం మేరకు అనుమతి తీసుకున్నాకే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు.

గడ్డివాము దగ్ధం

పర్వతగిరి : మండలంలోని చౌటపల్లికి చెందిన నీలం వెంకటయ్య ఏర్పాటు చేసుకున్న సుమారు లక్ష రూపాయల విలువైన గడ్డివాము బుధవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. గడ్డి వాముకు మంటలు అంటుకోగా స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అనంతరం అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నివాళి

రాయపర్తి : మండలంలోని కొండూరుకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు పోలినేని శ్యామ్‌రావు మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శ్యామ్‌రావు మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, మాజీ సర్పంచ్ కర్ర సరిత రవీందర్‌రెడ్డి, నాయకులు కోదాటి దయాకర్‌రావు, కొమ్ము రాజు, వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణరావు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

చెన్నారావుపేట : మండల కేంద్ర శివారులోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన జన్ను నర్సమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి భీమ్ సేన యూత్ బాధ్యులు ప్రతినిధులు బుధవారం 50 కేజీల బియ్యం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో భీమ్ సేన యూత్ ప్రతినిధులు కేశపాక వంశీ, పసునూరి రఘు, భాస్కర్, వేణు, రోషన్, బాబురావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమయానికి అందని రిపోర్టులు

టీ డయాగ్నొస్టిక్స్‌లో రోగులకు ఇబ్బందులు

- మేనేజర్, టెక్నీషియన్ పోస్టులు ఖాళీ
- కనీసం సమాధానం చెప్పేవారు కరువు

నర్సంపేట రూరల్: పట్టణంలోని టీ-డయాగ్నొస్టిక్స్ (టీ-హబ్)సెంటర్‌కు రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ల్యాబ్, ఎక్స్‌రే, ఈసీజీ, యూఎస్‌జీ, టిఫా స్కానింగ్ తదితర 57 రకాల పరీక్షలు చేయించుకునేందుకు ఇక్కడకు ఎక్కువ మంది వస్తారు. ప్రభుత్వ ఆస్పత్రికి సంబంధించిన స్థలంలో ఏర్పాటు చేసిన టీ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు జిల్లాలోని 13 మండలాల పీహెచ్‌సీల నుంచి రక్తనమూనాలు వస్తాయి. నమూనాలను పరీక్షించి 24 గంటల్లోగా రిపోర్టులను రోగులకు మెసేజ్ ద్వారా పంపిస్తారు. ఇందులో మైక్రోబయాలజీ-1, బయోకెమిస్ట్రీ-1, రేడియాలజిస్ట్-1, మేనేజర్-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల ఇక్కడ పనిచేసిన సిబ్బంది బదిలీపై మరోచోటుకు వెళ్లడంతో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రేడియాలజిస్ట్ రవికిరణ్ వర్ధన్నపేటకు వెళ్లారు. దీంతో నర్సంపేట వైద్య కళాశాలకు చెందిన రేడియాలజీ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ హఫీజ్‌ను నియమించారు. పాథాలజిస్టు ఒకరు, రేడియోగ్రాఫర్లు ఇద్దరు, డాటా ఎంట్రీఆపరేటర్ ఒకరు, ఫార్మాసిస్టు ఒకరు, సపోర్టింగ్ స్టాఫ్ ఒకరు మొత్తం ఆరుగురు విధులు నిర్వర్తిస్తున్నారు.

హబ్ ఏర్పాటు చేసినప్పటి నుంచి 2డీ-ఎకో మిషన్‌కు టెక్నీషియన్ కేటాయించలేదు. దీంతో అప్పటి నుంచి మిషన్ వృథాగా ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో 24 గంటల్లో ఇవ్వాల్సిన రిపోర్టులకు 72 గంటల సమయం పడుతోందని రోగులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వ్యాధి నిర్ధారణ జరిగేది ఎప్పుడు, వైద్య సేవలు అందేది ఎప్పుడని వారు ప్రశ్నిస్తున్నారు. మెసేజ్‌లు రాని వారు ఆస్పత్రి, హబ్ చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. విసిగివేసారి కొందరు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టీ-డయాగ్నొస్టిక్‌లో సరిపడా సిబ్బందిని నియమించి, సకాలంలో వైద్య పరీక్షల రిపోర్టులు ఇవ్వాలని రోగులు కోరుతున్నారు.



నర్సంపేటలోని టీ డయాగ్నొస్టిక్స్ సెంటర్

టీహబ్‌లో నెలవారీగా వివరాలు..

నెలలు	రక్త పరీక్షలు	మెమోగ్రాం	ఎక్స్‌రే	ఈసీజీ	యూసీజీ	టిఫా
జనవరి	14377	18	235	120	283	32
ఫిబ్రవరి	14747	18	334	37	253	31
మార్చి	12919	15	319	146	253	40
ఏప్రిల్	10447	12	330	146	260	44
మే	11948	18	345	175	250	35
జూన్	11867	14	361	175	313	40
జూలై	12389	12	376	120	257	35
ఆగస్టు	12735	04	305	103	216	52
సెప్టెంబర్	14260	04	365	110	187	36
అక్టోబర్	11524	03	245	90	194	39

రిపోర్టులు రాలేదు



జ్వరం రావడంతో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి ఈనెల 19న వచ్చాను. అయితే వైద్యులు పరీక్షలు రాయగా ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ తీసుకుని హబ్‌కు రక్తనమూనాలు పంపించారు. నాకు మెసేజ్ రాకపోవడంతో హబ్‌కు వెళ్లాను. కంప్యూటర్ ఆపరేటర్‌ను అడిగితే రేపు వస్తాయని సమాధానం చెప్పాడు. దీంతో తిరిగి ఇంటికి వెళ్లాను. సకాలంలో రిపోర్టులు రాకపోతే వైద్యం ఎలా చేస్తారు.

- సాయిచరణ్, ఖాదర్‌పేట

త్వరలోనే ఖాళీలను భర్తీ చేయిస్తాం..



నర్సంపేట హబ్‌లో నాలుగు పోస్టులతోపాటు కార్డియాలజిస్ట్ పోస్టు ఖాళీగా ఉంది. డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లి ఈ పోస్టులను త్వరలోనే భర్తీ చేయిస్తాం. ఈలోగా వైద్య కళాశాలకు టీహబ్‌ను అనుసంధానం చేస్తే వారే ఈ పోస్టులను భర్తీ చేసుకుంటారు.

- డాక్టర్ ప్రకాశ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, నర్సంపేట

సఖి సేవలతో మహిళలకు భరోసా



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న, తదితరులు

చెన్నారావుపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్న సఖి సెంటర్లతో బాధిత మహిళలు, బాలికలకు భరోసా లభిస్తుందని కేస్ వర్కర్లు తిరుమల స్వప్న తెలిపారు. మండంలోని అమీనాబాద్, చెన్నారావుపేట గ్రామాల్లో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. మహిళలు, బాలికలు పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి అండగా నిలిచేలా, రక్షణ కల్పించేలా ప్రభుత్వాలు సఖి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సఖి కేంద్రాల ద్వారా బాధితులకు కౌన్సిలింగ్ చేయడంతోపాటు న్యాయ, వైద్యసాయం అందుతుందని తెలిపారు. సఖి సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. సమస్యల్లో ఉన్న మహిళలు బయటకు రాలేకపోతే హెల్ప్‌లైన్ 181కు ఫోన్ చేస్తే రెస్క్యూ చేస్తారని తెలిపారు. మహిళలు, బాలికలు హక్కులు, చట్టాలతోపాటు డయల్ 100, 181, 1098, 14567, తదితర టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

కుట్టుశిక్షణతో ఆర్థికాభివృద్ధి



సంగెం : కుట్టుశిక్షణతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించగలరని ఏఎంఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, ఎస్‌పీడీసీఎల్ మాజీ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. మండలంలోని కాపులకనిపర్తిలో ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు నెలల ఉచిత కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరై మహిళలకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. మహిళలు చైతన్యవంతులై సమాజ ఉన్నతిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, రామారావు, రాజేశ్వర్‌రావు, పాలడుగుల సురేందర్, స్వప్న, డాక్టర్ పరికి సుధాకర్, నిర్మల, సునీత, సంధ్య, సుమలత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు బుధవారం కొనసాగాయి. ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో పల్లెపాటి వివేక్, ప్రీతి, అద్విత్‌కుమార్, శివరాం, దుగ్యాల దేవేందర్‌రావు, రూప, ప్రతీక్, అంజలి, అవ్యయ్, బేతం అఖిల్, రేణుక, విశాల్ జిన్ని, జూలూరు ప్రభాకర్ రాజ్యలక్ష్మి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సైఫ సురేశ్, కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, సభ్యులు మాదారపు చంద్రశేఖర్, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మి నారాయణ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో విద్యార్థుల ఉన్నతి



విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

నర్సంపేట రూరల్ : పోటీతత్వంతో విద్యార్థులు ఉన్నతి సాధించగలరని బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ తెలిపారు. బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'పర్యావరణ పరిరక్షణ'పై ఇటీవల నిర్వహించిన చిత్రలేఖనం, 'బాలల హక్కులు'పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన బాలాజీ టెక్నో, అక్షర హైస్కూల్ విద్యార్థులను బుధవారం ఆయన అభినందించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు అన్ని పోటీల్లో ప్రతిభ చాటాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రియాజొద్దీన్, క్రాంతికుమార్, భవానీ, చంద మరియ పాల్గొన్నారు.

గ్రీన్ ఒలంపియాడ్-2024 పరీక్ష


బాలాజీ టెక్నో స్కూల్‌లో బుధవారం నిర్వహించిన 'వాతావరణ మార్పులు-సమతుల్యత' అంశంపై నిర్వహించిన గ్రీన్ ఒలంపియాడ్-2024 జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలకు సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలను ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

బాలల హక్కుల రక్షణ బాధ్యత

నర్సంపేట : బాలల హక్కుల పరిరక్షణను సామాజిక బాధ్యతగా స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ అభివర్ణించారు. ప్రపంచ బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో స్వయంకృషి సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ సహకారంతో బుధవారం ప్రధానోపాధ్యాయుడు కాంతారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రభాకర్ మాట్లాడారు. బాలలకు జీవించే, రక్షణ పొందే, భాగస్వామ్య(పాల్గొనే), అభివృద్ధి చెందే హక్కులు ఉంటాయని వివరించారు. బాలల హక్కులను భంగం కలిగితే వెంటనే చైల్డ్‌లైన్-1098, డయల్ 100 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సహాయం తీసుకోవాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

వర్ధన్నపేట : క్రీడలతో విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని ఎస్సై చందర్ తెలిపారు. పట్టణంలోని ఫ్లస్కోస్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో బుధవారం నిర్వహించిన వార్షిక క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. నచ్చిన క్రీడాంశంలో సాధన చేసి దేశం గర్వించే స్థాయికి ఎదిగేలా రాణించాలని చెప్పారు. కేవలం చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ పాల్గొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మేరీ అంటోని, హెచ్ఎం సిస్టర్ డైసీ మాల, సిస్టర్ మేరీ జెనీఫర్ వలస, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎస్సై, తదితరులు

సకాలంలో సర్వే పూర్తి చేయాలి

పర్వతగిరి : సమగ్ర, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ ఎన్యుమరేటర్లకు సూచించారు. మండలంలోని జమాల్‌పురం, కల్లెడ, బూరుగుమల్ల, మంత్యవాలియాతండా గ్రామాల్లో జరుగుతున్న సర్వేను బుధవారం ఆయన పరిశీలించి ఎన్యుమరేటర్లకు సూచనలు అందించారు. మరో రెండ్రోజుల్లో సర్వే పూర్తి చేయాల్సి ఉందన్నారు. సర్వేలో అడిగిన పూర్తి సమాచారాన్ని సేకరించాలని చెప్పారు. తప్పులు దొర్లకుండా ఫారాలు నింపాలని ఆదేశించారు.

ఉద్యమకారుల సంక్షేమమే పాదయాత్ర లక్ష్యం

నర్సంపేట : తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమమే లక్ష్యంగా ఈనెల 27, 28 తేదీల్లో పాదయాత్ర తలపెట్టినట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు నందగిరి రజనీకాంత్ తెలిపారు. పట్టణంలో అమరవీరుల స్తూపం వద్ద ఫోరం డివిజన్ కన్వీనర్ బొట్ల పవన్ అధ్యక్షతన పాదయాత్ర కరపత్రాలను బుధవారం రజనీకాంత్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కవులు, కళాకారుల ఫోరం జిల్లా కన్వీనర్ లింగన్న, కోకన్వీనర్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీరు, జిల్లా ఉపాధ్యక్షులు వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన మాదాసి సాంబలక్ష్మి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్ రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. ఆయన సాంబలక్ష్మి కోసం పంపించిన రూ.5 వేల నగదును నాయకులు అల్లం మర్రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మాదాసి రాంబాబు, గాడుదల బొందాలు, ఎంబాడి మహేందర్, చాపర్తి కనుకయ్య, కందికొండ రాజ్‌కుమార్, తుప్పరి పున్నం, కాయిత అశోక్, ఓదెల ప్రశాంత్, తుప్పరి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే పంట ఉత్పత్తులకు మద్దతు ధర లభిస్తుందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి తెలిపారు. మండలంలోని దీక్షకుంటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తూకం, కోతల పేరిట మిల్లర్లు, అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. కొనుగోళ్లు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించే బాధ్యత అధికారుల మీదే ఉందని స్పష్టం చేశారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నాయకులు పెండ్యాల హరిప్రసాద్, కుసుమ చెన్నకేశవులు, మేర్గు కుమారస్వామి, నవీన్, రాంబాబు, కిరణ్, రాజ్‌కుమార్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

బోజెర్వులో..

చెన్నారావుపేట : మండలంలోని బోజెర్వులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు మొగిలి వెంకట్‌రెడ్డి, మునుగు ఐలయ్య, గడల స్వరూప మల్లయ్య, చెన్నారావుపేట సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, సీఈఓ పులి రమేశ్, అశోక్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



నెక్కొండ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి, తదితరులు

కొనుగోలులో నిర్లక్ష్యం వద్దు

ఖానాపురం : ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చేయొద్దని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఖానాపురం, ఇతర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి మాట్లాడారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులు నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, ఆర్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎం ప్రసూనలక్ష్మి

నర్సంపేట : ఆర్టీసీ ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండాలని స్థానిక డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి ఆకాంక్షించారు. డిపో ఉద్యోగుల జీవిత భాగస్వాముల కోసం ఏర్పాటు చేసిన గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్-2 కార్యక్రమాన్ని డిపో ఆవరణలో బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగుల ఆరోగ్యం మీదే కుటుంబాలు ఆధారపడి ఉంటాయన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాల ఆరోగ్య పరిరక్షణ కోసం గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈనెల 23 వరకు శిబిరం కొనసాగుతుందని చెప్పారు. ఉద్యోగులు జీవిత భాగస్వాములు హెల్త్ చెకప్ చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భవానీ, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్, సూపర్‌వైజర్ నారాయణ, ఎంప్లాయీస్ వెల్ఫేర్ బోర్డ్ సభ్యులు శశిధర్, సాంబయ్య, సెక్యూరిటీ హెడ్ వీరారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన సేవలు

చెన్నారావుపేట : ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని గురిజాల, కోనాపురం ఉపకేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. వైద్యులకు, సిబ్బందికి సూచనలు చేశారు. పసి చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. చిన్న పిల్లలకు సకాలంలో టీకాలు వేసి వ్యాధుల నుంచి రక్షించాలని తెలిపారు. నిమోనియా లాంటి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. చలికాలంలో వేడి పదార్థాలు తీసుకోవాలని సూచించారు. చర్మ సమస్యలు తలెత్తకుండా శరీరానికి కొబ్బరి నూనె రాసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సరోజ, సీహెచ్‌ఓ భద్రయ్య, హెచ్ఈఓ విద్యాసాగర్‌రెడ్డి, వీసీసీఎం రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

'ఆడదూడల పథకం'తో పాడిరైతులకు లబ్ధి



పశువులకు చికిత్స చేస్తున్న డాక్టర్ రాజు

సంగెం : ఆడదూడలు జన్మించేలా ప్రభుత్వం చేపట్టిన పథకంతో పాడిరైతులకు లబ్ధి చేకూరుతుందని మండల పశు వైద్యాధికారి డాక్టర్ వల్లె రాజు తెలిపారు. మండలంలోని నల్లబెల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరంలో పలు పశువులకు వైద్యులు, సిబ్బంది వైద్యసేవలు అందించారు. దూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. గాలికుంటు నివారణ టీకాలు వేశారు. అలాగే 76 పశువులను పరీక్షించి ఎదకు రాని 18 పశువులను గుర్తించి 9 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స చేశారు. 22 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడారు. పశువులు వ్యాధుల బారిన పడ్డాక చికిత్స చేయించేకంటే నివారణ చర్యలు చేపట్టడం ఉత్తమమని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆడదూడల పథకాన్ని పాడిరైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ అనిల్, గోపాల మిత్రలు కమలాకర్, వీరేశ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే ప్రజాసమస్యల పరిష్కారం

- సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య

నర్సంపేట రూరల్ : పోరాటాల ద్వారానే ప్రజాసమస్యల పరిష్కారం సాధ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య స్పష్టం చేశారు. మండలంలోని మహేశ్వరంలో బుధవారం నిర్వహించిన ఆ పార్టీ మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని తెలిపారు. బూర్జువా పార్టీలు ఎప్పటికీ ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపవని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలు ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ శక్తులకు, సంపన్నులకు లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచిపెట్టేలా కార్యక్రమాలు చేపడుతున్నాయని వివరించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన దాఖలాల్లేవన్నారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులు సహా అన్ని తరగతుల ప్రజలు పాలకుల విధానాలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోరబోయిన కుమారస్వామితోపాటు 14 మంది సభ్యులు ఎన్నికయ్యారు. సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈసంపెల్లి బాబు, భూక్య సమ్మయ్య, జిల్లా కమిటీ సభ్యులు నమిండ్ల స్వామి, హన్మకొండ శ్రీధర్, నాయకులు మలహల్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

గీసుకొండ : వరంగల్ నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయించిన క్రమంలో మురికివాడల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు కోరారు. మండలంలోని గొర్రెకుంటలో గుండె భద్రి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశానికి శ్రీనివాస్‌రావు హాజరై మాట్లాడారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. విరాళాలు సేకరించారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి, నాయకులు పంజాల రమేశ్, షేక్ భాషుమియా, ప్రసాద్, చంద్రకళ, రమేశ్, రవీందర్, లక్ష్మణ్, మునీశ్వరుడు, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ అమలులో నిర్లక్ష్యం

దుగ్గొండి : ఎస్సీ వర్గీకరణ అమలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ అన్నారు. మండల కేంద్రంలో కొలగాని రవి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ప్రణయ్‌దీప్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును సీఎం విస్మరించారని తెలిపారు. వర్గీకరణ సాధన కోసం డిసెంబర్ 21న హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని చెప్పారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామునూరి శ్రీధర్, ప్రధాన కార్యదర్శులుగా జన్ను అశోక్, గంగారపు రవి ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు నల్లబెల్లి సదానందం, హనుమకొండ బాబు, తాళ్లపెల్లి రవి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట
డి. కిరణ్ (S.R) : 9949808352 (నర్సంపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944